క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సిటీ సబ్ స్టేషన్ 11కేవీ నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలో నూతన లైన్ల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 24వ వతేదీ శనివారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కలరోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజుల వీధి, నరసింహనాయుడు వీధి, వెంకటరత్నం వీధి, కాళేశ్వరరావు రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ చేయనుండటంతో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు పలుప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కండ్రిక, జర్నలిస్ట్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, రాజీవ్‌నగర్, ఎంఐజీ, ఎల్ఐజీ కాలనీలు, విశాలాంధ్ర కాలనీ, ఈడబ్ల్యూఎఎస్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, రాధానగర్, ప్రజాశక్తినగర్, బర్మాకాలనీ, పాయకాపురం, భగీరథ కాలనీ, ఏవీఎస్‌రెడ్డి రోడ్డు, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, లక్ష్మీనగర్,శాంతినగర్, దేవినేని గాంధీపురంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తప్పనిసరిగా డ్రైడే పాటించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు తప్పనిసరిగా డ్రైడే పాటించి.. ఇళ్లలో నీటి నిల్వలను తీసేయాలని జిల్లా మలేరియా ఆఫీసర్ మోతీ బాబు, బయాలజిస్టు సూర్యానాయక్ అన్నారు. 28వ డివిజన్ భానునగర్‌లో శుక్రవారం నగర పాలకసంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యాన డ్రైడే ఫ్రైడే అవగాహన కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ దోమలతో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. దోమలు నీటి నిల్వల్లో పెరుగుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల నియంత్రణకు సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రాయల్ క్లబ్ నారీశక్తి కార్యవర్గం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాయల్‌క్లబ్ నారీశక్తి నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. రాయల్‌క్లబ్ నారీశక్తి క్లబ్ ప్రెసిడెంట్‌గా ఏపుగంటి లక్ష్మీ అపర్ణ, కార్యదర్శిగా దాసరి సుజాత, కోశాధికారిగా కెంబూరి భవాని ఎన్నికయ్యారు. నగరంలోని అమ్మ కల్యాణ మండపంలో గురువారం రాత్రి జరిగిన క్లబ్ ప్రారంభోత్సవంలో నూతన కమిటీ సభ్యులతో రాయల్ క్లబ్ పాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్ మిరియాల వెంకటేశ్వరావు, ఇమిడియట్ పాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్ సుంకర కృష్ణ, రామిశెట్టి కొండలరావు, ఏపుగంటి సాయికృష్ణ తదితరులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాయల్ క్లబ్ నారీశక్తి సభ్యులను వారు అభినందించారు.

హనుమంతుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. తెల్లవారుజామున 5 గంటలకు నిత్యారాధన, పంచామృత స్నపనము, నాగవల్లి దళ సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. స్వామివారికి విశేషంగా సిందూరం, ఆకుపూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఈఓ పాతూరి లోకేశ్వరి పర్యవేక్షించి ఏర్పాట్లు చేశారు.

చెత్త సేకరణతో సంపద సృష్టించాలి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించడం ద్వారా చెత్త వ్యర్థాల నుంచి ఎరువులు తయారు చేసి సంపద సృష్టించాలని విజయవాడ డీఎల్‌పీఓ లావణ్యకుమారి అన్నారు. కేతనకొండ గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. వర్మికంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. వ్యవసాయ భూముల్లో వర్మికంపోస్ట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలపై సర్పంచులు అవగాహన పెంచుకోవాలన్నారు.

వాటర్ పైప్‌లైన్ పనులతో సహనానికి పరీక్ష

- రోడ్డును తవ్వటంలో ఉన్న శ్రద్ధ పూడ్చటంలో లేదు
- రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 27వ డివిజన్ పరిధిలోని దుర్గాపురంలో వాటర్ వర్క్స్ పనులు స్థానికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. డివిజన్‌లో వాటర్ పైపులైన్‌లు పాతకాలం నాటివి కావటంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో కొత్త పైపులైన్‌లు వేస్తున్నారు. ఇందుకుగానూ రోడ్లను తవ్వి కొత్తపైపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. రోడ్డుపై తవ్విన గోతులను మాత్రం సరిగా పూడ్చడంలేదు. గోతుల మయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై గోతుల్లో నీరు చేరుతోంది. గోతుల్లో నీరు చేరడాన్ని గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలకు గోతుల్లో మట్టి రోడ్డుపైకి చేరి బురదమయంగా మారుతోందని పేర్కొంటున్నారు.





సాంబమూర్తి రోడ్డులో తవ్వి సరిచేయని రహదారి

నెల రోజులు దాటినా..

వాటర్ పైపులైన్ పనుల కోసం తవ్విన రోడ్డుకు, పనులు పూర్తయ్యి నెల రోజులు దాటినా మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే సాంబమూర్తి రోడ్డు, దుర్గాపురం వాకర్స్ క్లబ్, బావాజీ పేట తదితర ప్రాంతాల్లో రోడ్లపై గుంతల వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లను సరిచేయాలని ఎన్నిమార్లు విన్నవించుకున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడంలేదని దుర్గాపురం వాసులు ఆరోపిస్తున్నారు.

కంటితుడుపు చర్యలు

27వ డివిజన్‌లో వాటర్ పైపులైన్‌ల పనుల కోసం తవ్విన గోతులు సరిచేయాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ అధికారులకు ఇప్పటికే వినతి పత్రం సైతం అందజేశారు. దీనిపై అధికారులు కొన్ని చోట్ల తూతూ మంత్రంగా మరమ్మతులు చేశారు. కేవలం డస్ట్‌ను పోసి చేతులు దులుపుకొన్నారు. పత్రికల్లో వార్తలు వస్తే, ఆ ప్రాంతంలో మాత్రమే రోడ్డుకు మరమ్మతులు చేసి సరిపెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

గోతులను సరిచేయాలి



పాతకాలం నాటి పైపులను తొలగించి పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త వాటర్ పైపులైన్‌లు వేయటం అభినందనీయం. అయితే పైపులైన్‌ల పనుల కోసం తవ్విన గోతులను పనులు పూర్తయ్యి నెల రోజులు దాటినా పూడ్చకపోవటం విచారకరం. గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకు ఆందోళనగా ఎదురు చూడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పైపులైన్ పనుల కోసం తవ్విన గోతులను సరిచేయాలి

– గుర్రం ఏడు కొండలు, దుర్గాపురం

పూర్తిస్థాయిలో పూడికతీత చేయండి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న డిసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం హనుమాన్‌పేటలోని వెహికల్ డిపో, రైల్వేస్టేషన్, జెండా చెట్టు, నైజాంగేట్, గాంధీ హిల్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్లను, ఎంజీ రోడ్, బీఆర్టీ రోడ్, నెహ్రూ రోడ్, లోబ్రిడ్జి ప్రాంతం, గణపతిరావు రోడ్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా రోజూ డిసిల్టింగ్ పనులు చేయాలని ఆదేశించారు. కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద ఎస్కలేటర్‌ను పెట్టి ఫ్లోటింగ్ గార్బేజ్‌ను త్వరితగతిన తీయించాలని, డ్రైన్‌పై స్లాబ్‌ని తీసేసి డిసిల్టింగ్ ప్రక్రియ సజావుగా చేసేందుకు గ్రిల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న వీఎంసీ అధికారులు

వార్డ్ స్పెషల్ ఆఫీసర్లూ.. సమస్యలను పరిష్కరించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు వార్డులోని ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశ హాల్లో ఆయన వార్డ్ స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్స్ సంజయ్ రత్నకుమార్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

క్యూలో భక్తులకు సదుపాయాలు కల్పించాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు క్యూలైన్లలో అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని ఆలయ ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దుర్గగుడి ఈవో శీనానాయక్ శుక్రవారం మహా మండపంలోని అంతస్తులను తనిఖీ చేశారు. మహా నివేదన సమయంలో క్యూలైన్‌లో పెద్ద ఎత్తున భక్తులు వేచి ఉండటంతో వారికి దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. క్యూలైన్లలో మంచినీటి సదుపాయంతో పాటు సీలింగ్ ఫ్యాను పని చేసేలా చూడాలని సూచించారు. అదే విధంగా మరుగుదొడ్లను తరచూ శుభ్రం చేయడంతో పాటు మార్గమధ్యలో చంటి పిల్లలకు పాలిచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం మహా మండపం 5వ అంతస్తులోని పూజా సామగ్రి విక్రయించే దుకాణాలను పరిశీలించారు. పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని టోల్‌ఫ్రీ నంబర్ చాంబర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో నమోదు చేసుకున్న భక్తుల వివరాలను పరిశీలించడంతో పాటు సమాచారం కోసం ఫోన్ చేసిన భక్తురాలితో ఈవో మాట్లాడారు. ఆలయ సిబ్బంది దేవస్థాన సమాచారం మొత్తాన్ని అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈవో వెంట పలువురు ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహా మండపంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఈవో శీనానాయక్

అభివృద్ధి పనులు వేగంగా చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్లోని చేపల మార్కెట్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం రూ. 57లక్షలతో చేపల మార్కెట్ వద్ద చేసే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్యార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్య కళాశాలకు చెందిన చిన్నారులు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్యాచార్య రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో 15 మందికి పైగా శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు.

శ్రీనివాసునికి తులసీదళ అర్చన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రత్నమాచార్యులు శిష్య బృందం స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌ను తులసీ దళాలతో అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. సాయంత్రం స్వామి వారికి పంచ హారతుల సేవ, ఏకాంత సేవలను నిర్వహించారు.

పర్సనల్ బ్రాంచ్ సందర్శన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే పీసీసీఓ (ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్) సిద్ధార్థ్ కాటి శుక్రవారం విజయవాడ డివిజన్‌లోని పర్సనల్ బ్రాంచ్‌ను సందర్శించి అధికారుల పనితీరు, సిబ్బంది సంక్షేమంపై సమీక్షించారు. ముందుగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌ను కలుసుకుని విజయవాడ డివిజన్‌లోని హెచ్ఆర్ సంబంధిత విషయాలపై చర్చించారు. అనంతరం పర్సనల్ బ్రాంచ్ పనితీరుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ సీనియర్ డీపీఓ ప్రేమ్‌కుమార్ లకావత్ డివిజన్‌లో ఉద్యోగుల సంక్షేమానికి చేపట్టిన చర్యల గురించి వివరించారు. రైల్వే ఉద్యోగులకు అందిస్తున్న సేవను మెరుగుపర్చాల్సిందిగా పీసీసీఓ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మరణించిన ఉద్యోగుల విషయంలో సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు సెటిల్‌మెంట్‌లను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం గుర్తింపు కలిగిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంఘాల నేతలతో మాట్లాడారు. విధుల్లో సిబ్బందికి ఎదురవుతున్న పలు సమస్యలపై యూనియన్ నేతలు అందించిన వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారు.



ఉద్యోగుల సంఘాల నుంచి వినతి పత్రాలు అందుకుంటున్న పీసీసీఓ సిద్ధార్థ్ కాటి

చిన్నారుల మేధో వికాసానికి ఫన్ అండ్ లెర్న్



వేసవి శిబిరంలో చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ, నిర్వాహకులు



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ఏర్పాటు చేసే ఉచిత శిబిరాల్లో ఫన్ అండ్ లెర్న్ వంటి కార్యక్రమాలు చిన్నారుల మేధో వికాసానికి దోహదపడతాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పేరాల అంకినీడు ఆధ్వర్యాన పటమట న్యూ ఆర్టీసీ కాలనీలోని మదర్‌థెరిసా మున్సిపల్ పార్క్‌లో చిన్నారులకు ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ శిబిరాన్ని ఏప్రిల్ 29న ప్రారంభించామని, ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు వివిధ క్రీడలతోపాటు క్విజ్, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, క్రాఫ్ట్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. సామాజిక నైపుణ్యాలను అలవాటు చేసేలా గ్రూప్ టాస్క్‌నుకూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వేసవి శిబిరంలో చిన్నారుల శారీరక, మానసిక వికాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్‌ను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన శిబిరం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వేసవి ఉచిత శిబిరం నిర్వాహకులు, సీఎంఓ అధికారి డి.శ్రీనివాసన్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ ఐజీ టి.సరోజ, వలంటీర్లు పాల్గొన్నారు.

మహా పూర్ణాహుతితో ముగిసిన హనుమత్ దీక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో దీక్ష విరమణలు, హనుమత్ జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శుక్రవారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామిజీ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు రామకృష్ణ, శిష్యబృందం పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పీఠం కన్వీనర్, ప్రధాన కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్ పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆంజనేయ స్వామి వారి మూలవిరాట్‌కు తమల పాకులతో అర్చన నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దీక్ష విరమణలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా భక్తులు దీక్షలను విరమించి, స్వామి వారికి ఇరుముడులను సమర్పించారు. పూర్ణాహుతి అనంతరం దుర్గాప్రసాద్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. తెలంగాణ నుంచి భక్తులు దీక్షలను విరమించేందుకు పీఠానికి తరలివస్తూనే ఉన్నారు. పూజా కార్యక్రమాలలో ఆలయ నిర్వాహకులు ఓంకార్, రాంపిళ్ల చైతన్య, ఇతర పలువురు శిష్య బృందం పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో దుర్గాప్రసాద్‌స్వామిజీ

24 గంటలూ మద్యం విక్రయాలు!

పాయకాపురం(విజయవాడరూరల్): మద్యం విక్రయాలకు సంబంధించి ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలు కనుచూపు మేర కనిపించడం లేదు. మద్యం షాపుల్లో, బార్లలో సమయపాలన లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి మద్యం అమ్మకాలు 24 గంటలూ జరుగుతున్నాయి. శుక్రవారం నున్న పీఎస్ పరిధి వాంబే కాలనీ రోడ్డులో ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉదయం 7 గంటలకే మద్యం అమ్ముతున్నారు. ఆ మార్గంలోనే కాదు అన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో షట్టర్లు క్లోజ్ చేసి ఉంచి సైడ్ డోర్ నుంచి విక్రయిస్తున్నారు. మద్యం షాపుల విషయానికి వస్తే పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేకపోయినా పరదాల చాటున కుర్చీలు వేసి సిటింగ్ సదుపాయాలు ఏర్పాట్లు చేసి విక్రయాలను రెట్టింపు చేసుకొంటున్నారు. కండ్రిక పాతపాడు రోడ్డులో మద్యం షాపులో పరదా చాటున సిటింగ్ జరుగుతోంది. ఫోన్‌లో ఆర్డర్ ఇస్తే డోర్ డెలివరీ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఇవన్నీ ఎక్సైజ్ అధికారులకు, పోలీసు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.



పాతపాడు రోడ్డులో మద్యం షాపు వద్ద పరదా ఏర్పాటు

సృజనకు ప్రాధాన్యమివ్వాలి

విజయవాడ కల్చరల్: రచన, సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలకు నిర్వాహకులు ప్రాధాన్యమివ్వాలని ఎక్స్‌రే సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, స్వచ్ఛాంధ్ర ఆధ్వర్యాన బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో 10 రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. నిర్వాహకులు బాల బాలికలకు చిత్రలేఖనం, వ్యాసరచన, గ్రంథాలను గుర్తించడం అంశంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిథి కొల్లూరి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన పన్నులను ఇవ్వాలన్నారు. గ్రంథాలను అందుబాటులో ఉంచాలని గురువులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక నాయకులు గోళ్ల నారాయణరావు, ఎస్ఎస్ నాగిరెడ్డి, లక్ష్మయ్య, శిబిరం నిర్వాహకులు హసినా, ప్రసాద్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న కొల్లూరి, నాగిరెడ్డి, గోళ్ల నారాయణరావు, లక్ష్మయ్య తదితరులు

ఆనందమయ జీవితానికి యోగా దోహదం

భవానీపుర(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం (జువెనైల్ హోమ్)లోని బాలురకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. దత్త క్రియ యోగా సెంటర్ సహకారంతో కేబీఎన్ కళాశాలలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్లు యోగాపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేబీఎన్ కాలేజి వ్యాయామ అధ్యాపకులు డి.హేమచంద్రరావు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఆరోగ్యకరమైన ఆనందమయ జీవితానికి యోగాసనాలు దోహదం చేస్తాయని తెలిపారు. నాడీ శుద్ధి వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర అంశాలపై ఎన్. సాంబశివరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వి.నారాయణరావు, కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను ఒక భాగం చేసుకోవాలని సూచించారు. తద్వారా శారీరక, మానసిక రోగాలు దూరం కావడమే కాకుండా ఫిట్‌నెస్‌కు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పవన్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

నున్నలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

నున్న(విజయవాడరూరల్): నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నున్న గ్రామంలో ప్రస్తుతం ఉన్న కమర్షియల్ విద్యుత్ మీటర్లస్థానే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. కొత్త మీటర్లను ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టు తీసుకున్న సంస్థ సిబ్బంది యజమానులకు కనీస సమాచారం లేకుండా పాత మీటర్లను తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడంపై యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మొత్తం దాదాపు 37 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటిలో సుమారు 4 వేలు కమర్షియల్ కనెక్షన్లు ఉన్నట్లు ఏఈ శివారెడ్డి తెలియజేశారు. ఏపీసీపీడీసీఎల్ సంస్థ నుంచి వచ్చిన జాబితా ప్రకారం తొలివిడతగా కమర్షియల్ విద్యుత్ మీటర్ల స్థానే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని కేటగిరిల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం పూర్తి చేసిన తర్వాత వినియోగదార్ల నుంచి విద్యుత్ వినియోగంపై ప్రీ పెయిడ్, పోస్టు పెయిడ్ వసూళ్లు ఉంటాయని అంటున్నారు. విద్యుత్ వినియోగం యూనిట్ల మీటర్ రీడింగ్ ఆన్‌లైన్ సిస్టమ్‌లో నమోదు జరుగుతుంది సిబ్బందితో పనిలేకుండా మీటర్ రీడింగ్ తీయడం జరుగుతుందని సిబ్బంది చెబుతున్నారు. బిల్లు పేమెంట్ కూడా ఆన్‌లైన్లో చెల్లింపులు ఉంటాయంటున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ చోరీలను అరికట్టవచ్చని చెబుతున్నారు.